క్లుప్తంగా

సమ్మె కాలపు వేతనం అందజేయండి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

యాలాల: సమ్మె కాలపు వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని సమగ్ర శిక్ష ఉద్యోగులు విన్నవించారు. ఆదివారం మండలంలోని రాఘవపూర్ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేతో వారు తమ బాధను వ్యక్త పరిచారు. నెల రోజుల పాటు తాము సమ్మె చేశామని, విరమణకు ప్రభుత్వం కొన్ని ప్రతిపాదనలు అంగీకరించిందన్నారు. వీటిలో భాగంగా తమకు సమ్మె కాలపు వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ విషయం లో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి తమకు న్యాయం జరిగేవిధంగా చొరవ చూపాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రభావతి, క్రిష్ణవేణి, పార్వతీ, ప్రశాంతి, గోపిక, అనిత తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న జిల్లా కమిటీ నాయకులు

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్ గ్రామం లో అఖిల భారత యాదవ సంఘం గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, ఆంజనేయులు, కోశాధికారిగా మల్లేశ్, కార్యదర్శులుగా రాములు యాదయ్య, మోహన్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యాదవులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు రాఘవేందర్, దుద్యాల్ మండల అధ్యక్షుడు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డర్‌కు సన్మానం



అభిషేక్‌ను అభినందిస్తున్న పీఆర్టీయూ నాయకులు

యాలాల: జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన పాత తాండూరు వాసి అభిషేక్‌ను ఆదివారం యాలాల మండల పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, రాములు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాత తాండూరులోని కోటేశ్వర ఆలయ పూజారి శేఖర్ స్వామి తనయుడు అభిషేక్ బాడీ బిల్డింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. అతను భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త చాట్ల విశ్వనాథ్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



ఓంకారేశ్వర ఆలయ ప్రారంభోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కుల్కచర్ల: కుల్కచర్ల మండల కేంద్రంలో నిర్మించిన ఓంకారేశ్వర దేవాలయ ప్రారంభోత్సవ ఉత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం కుల్కచర్లలో ఉత్సవ కమిటీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని ఆయా మండలాల ప్రజానీకం పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

నేడు ఉపాధి హామీ ప్రజా వేదిక

తాండూరు రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ నరోత్తంరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ఉంటుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పక హాజరు కావాలని కోరారు.

తాగునీటి ఎద్దడి!

- ఓగిపూర్‌లో తరచూ పైప్‌లైన్లకు మరమ్మతులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎస్సీ కాలనీ వాసులు
- పట్టించుకోని అధికారులు



నల్లా కనెక్షన్‌ను చూపిస్తున్న ఎస్సీ కాలనీ వాసి మ్యాతరి నర్సమ్మ

తాండూరు రూరల్: తెలంగాణ–కర్ణాటక సరిహద్దులోని తాండూరు మండలం, ఓగిపూర్ గ్రామం లో తాగునీటి ఎద్దడి నెలకొంది. కొన్ని నెలల నుంచి గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సరఫరా సక్రమంగా లేదు. ఓగిపూర్ గ్రామంలో 340 ఇళ్లు, 1500 మంది జనాభా ఉంది. కొందరు నాపరాతి గనుల్లో, మరికొందరు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. 25 ఏళ్ల క్రితం గ్రామంలో తాగునీటి కోసం గ్రామ సమీపంలోని కుర్వ నాగప్ప పొలంలో బోరు మోటారు వేశారు. అక్కడి నుంచి పైప్‌లైన్ సహాయంతో గ్రామంలోని ఓహెచ్‌ఆర్ ట్యాంకుకు నీటిని నింపేవారు. అక్కడి నుంచి ఆయా కాలనీలకు నల్లాల ద్వారా నీటి సరఫరా చేశారు.

పైప్‌లైన్ లీకేజీ..

25 ఏళ్ల క్రితం వేసిన తాగునీటి పైప్‌లైన్లు మరమ్మతులకు గురవుతోంది. దీంతో ఎస్సీ కాలనీతో పాటు ఎస్టీ కాలనీలకు నీటి సమస్య ఏర్పడింది. తరచూ పైప్‌లైన్ లీకేజీ అవుతుంది. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ఎస్సీ కాలనీలో నివాసం ఉండే మ్యాతరి నర్సప్ప ఇంటితో పాటు చుట్టు పక్కల నల్లాలకు నీరు సక్రమంగా రావడం లేదని కాలనీ వాసులు చెబుతున్నారు. దీంతో వారు మ్యాతరి సందప్ప ఇంటి వద్ద ఉన్న చేతిపంపు నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా



ఓగిపూర్ గ్రామంలో తాగునీటి ఎద్దడిపై వారం రోజుల క్రితం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. 25 ఏళ్ల క్రితం తాగునీటి కోసం వేసిన పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురవుతుంది. పంచాయతీ కార్యదర్శి నిధులు వెచ్చించి మరమ్మతు పనులు చేయిస్తున్నప్పటికి నీటి పరిష్కారం కాలేదు. వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత బోరు మోటారు నుంచి గ్రామానికి కొత్త పైప్‌లైన్ వేయిస్తాం. గ్రామం మొత్తానికి భూమి పొరల్లో బండలు ఎక్కువగా ఉండటంతో బోరు మోటారు వేయించడానికి కష్టంగా మారింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను సత్వరమే పరిష్కరిస్తాం.

– విశ్వప్రసాద్, ఎంపీడీఓ, తాండూరు మండలం

ఎస్సీ కాలనీ అంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓగిపూర్ గ్రామంలో మిషన్ భగీరథకు సంబంధించి తాగునీరు కూడా సక్రమంగా వదలడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇంటింటికి నల్లా ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వలేదన్నారు. మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని గ్రిడ్ ఏఈ తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, గ్రామస్తులు

యాలాల: ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాఘవపూర్ శివారులో రక్తమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రక్త మైసమ్మ ఆశీస్సులు రాఘవపూర్ గ్రామంపై ఎల్లప్పుడు ఉండాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను, అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, సిద్రాల శ్రీనివాస్, హన్మంతు, మహిపాల్, రఘురాంరెడ్డి, గాజుల మన్నాన్, లక్ష్మీకాంతరెడ్డి గ్రామస్తులు అమర్‌నాథ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కుర్వ శ్రీనివాస్, వడ్డే శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



తాండూరు రూరల్: పనులు ప్రారంభిస్తున్న సందీప్‌కుమార్



ధారూరు: రజక కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్: మంబాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద నిధులు రావడంతో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సందీప్‌కుమార్ పూజలు చేసి రోడ్డు పనులను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో అన్నీ గ్రామాల్లో సీసీరోడ్లుకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్, శ్రీనివాస్‌గౌడ్, దస్తప్ప, దాస్, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..



మోమిన్‌పేట: సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న వడ్ల నందు తదితరులు

మోమిన్‌పేట: గ్రామాల అభివృద్ధే లక్ష్యమని జిల్లా బీజేపీ కోఆర్డినేటర్ వడ్ల నందు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మేకవనంపల్లిలో రూ.5లక్షల ఎంపీ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ మధ్యతరగతి కుటుంబాలకు ఊరట నిస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ హయంలోనే దేశం పురోగమిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అశిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు భుజంగ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాంచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: రజక కాలనీలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో ధారూరులోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు వేయిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కల్వ కిరణ్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, బుజ్జిగౌడ్, ఇబ్రాహీం, బోయిని అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు అనుకూల బడ్జెట్



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

పరిగి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్‌కు అనుకూలంగా ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు వెంకటయ్య పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక తరగతులకు, రైతులకు వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్‌ను బీజేపీ రూపొందించిందన్నారు. విద్య, వ్యవసాయ, వైద్య రంగాలను పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్న ఉపాధిహామీ పథకానికి నిధులు తగ్గించడంతో పేదల కడుపుకొట్టినట్టేనన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపించిందన్నారు. రెండు కోట్ల ఇళ్లను నిర్మిస్తామన్న కేంద్రం బడ్జెట్‌లో అందుకు తగిన నిధులు కేటాయించలేదన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హబీబ్, సత్తయ్య, రఘురాం, శేకర్, రాజేందర్, సాయి, వినోద్, నర్సింహులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ లక్ష్యంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మఠం రుషికేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు రూ.1లక్ష 54వేల కోట్లను ఎలాంటి వడ్డీ లేకుండా రుణాలను ఇచ్చేందుకు కేటాయించిందని పేర్కొన్నారు. రూ.12.70లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి జీరో టాక్స్ నిర్ణయాన్ని తీసుకోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఏడాదికి లక్ష వరకు ఆదా అవుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాలకు ఆమోద యోగ్యమైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినందుకు ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలాసీతారామ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

కార్పొరేట్ విద్యకు అనుకూలం

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేటీకరణ విద్యకు అనుకూలంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ విద్యారంగానికి తీరని అన్యాయం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మోదీ ప్రభుత్వం మొండిచేయి చూపిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్నా విభజన హామీ చట్టంలో పేర్కొన్న హామీలు కేంద్రం నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్ర విద్యారంగ అభివృద్ధికి సరిపోయే నిధులను బడ్జెట్‌లో కేటాయిస్తే

9 నుంచి వేణుగోపాల స్వామి జాతర

మంచాల: మండల పరిధిలోని ఆరుట్లలో ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు శ్రీ వేణుగోపాల స్వామి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు ఆరుట్లతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చీరాల రమేశ్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ఎల్లేశ్, చంద్రయ్య, భాస్కర్, రాములు, బాషా, పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అమీర్‌గూడలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఆదివారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ కోట్ల నరోత్తంరెడ్డి భూమిపూజ చేశారు. మందడి వెంకట్‌రెడ్డి, లక్ష్మినారాయణ, నర్సింహారెడ్డి, సత్తిరెడ్డి, తిరుపతి రెడ్డి, మల్లేశ్‌ముదిరాజ్, ఈశ్వర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



తాండూరు రూరల్: బహుమతుల ప్రదానం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వర్గీయ డాక్టర్ వికాస్ జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం ముగింపు కార్యక్రమానికి హాజరై శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఆటలు ఆడటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. విద్యార్థులు ఆటలపైనే కాకుండా చదువుల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఐ ఫ్యాక్టరీ జీఎం శరత్‌చంద్ర, హెచ్‌ఆర్ మేనేజర్ అమిత్ రంజన్, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ శరణు బసప్ప, నర్సయ్య గౌడ్, చారి, కృష్ణ, అనిల్, సుధాకర్, భరత్‌కిషోర్, ప్రవీణ్, శ్రీనివాస్‌గౌడ్, రాజు, సునీల్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: క్రీడల్లో గెలుపోటములు సహజమని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హన్మంతు పేర్కొన్నారు. మండలంలోని బాలంపేట గ్రామం లో యూత్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఆదివారం ముగింపు కార్యక్రమంలో హన్మంతు మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆడబిడ్డ లక్ష్మీదేవితో సమానం

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీరాంరెడ్డి

షాబాద్: ఆడబిడ్డ ఇంటికి లక్ష్మీదేవితో సమానమని, ఆడబిడ్డకు జన్మనించిన ప్రతీ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్నట్లు సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిమ్మాన్పోళ్ల శ్రీరాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన కడుమూరు మహేందర్, ప్రశాంతి దంపతులకు ఆడ శిశువు జన్మించడంతో వారికి రూ.5వేల 211 రూపాయలు నగదు అందజేసినట్లు తెలిపారు. తమ గ్రామంలో ఇప్పటివరకు 22 మంది దంపతులకు ఆయన సొంతంగా ఆర్థికసాయం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సత్తయ్య, దేవేందర్‌రెడ్డి, కురుణాకర్‌రెడ్డి, మల్లేశ్, మహేందర్, రాములు, రాజు తదితరులు ఉన్నారు.

శ్రీవారి సేవలో తరించాలి

టీటీడీ ఆర్గనైజర్ చంద్రశేఖర్‌గౌడ్



శ్రీవారి సేవకు వెళ్లేవారితో చంద్రశేఖర్‌గౌడ్

బొంరాస్‌పేట: తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రీవారి సేవకు వెళ్లనున్న భక్తుల జన్మ తరిస్తుందని టీటీడీ ఆర్గనైజర్ చంద్రశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రేగడిమైలారం లో ఆయన టీటీడీ సేవకు వెళ్లే సేవకులతో సమావేశమయ్యారు. ఈ నెల 4న కుమ్మరి వెంకటయ్య బృందం 15మంది, 24న దాసరి రాములు బృందం 12మంది, నెల్లి అంజిలయ్య బృందం 15మందితో శ్రీవారి సేవకు వెళ్లనున్నారు. వారం రోజుల పాటు అక్కడ భక్తులకు సేవలందించనున్నారు. 40 ఏళ్లుగా శ్రీవారి సేవకు సేవకులను తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సేవ అనంతరం స్వామి వారిని దర్శించుకొని సద్గుణాలను అలవర్చుకునేవిధంగా వేడుకోవాలన్నారు. తాను ఇప్పటివరకు 81సార్లు సేవ బృందాలను పంపిచానన్నారు. గ్రామం నుంచి సుమారు 200మంది సేవకు వెళ్తారని చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు వివక్ష చూపించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీహార్‌కు అధికంగా నిధులు ఇచ్చి రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు మాత్రమే బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. వనరుల వినియోగ సామర్థ్యం ఉన్న తెలంగాణ వంటి రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రాష్ట్రాల ఆదాయ వాటా తగ్గించేలా కేంద్రం వ్యవహరించిందన్నారు. సెస్‌లను పెంచడం ద్వారా రాష్ట్రాలకు రావాల్సిన ఆదాయపు వాటా మరింత తగ్గిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన సందర్భంగా చేసుకున్న ఒప్పందాలను కూడా కేంద్రం విస్మరించిందన్నారు. శ్రమ తగినంత వేతనం అందడం లేదని ఎంతో కాలంగా ఉపాధి హామీ కూలీలు ఆందోళన చెందుతున్నారని, బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి గతంలో కంటే తక్కువ నిధులు కేటాయిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజలు ఎంతో నమ్మకంతో ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి అధిక స్థానాలు అందిస్తే వారిని కేంద్ర ప్రభుత్వం నట్టేట ముంచిందని ఆరోపించారు. చిన్న రాష్ట్రాలను ఆర్థికంగా బలహీన పరిచి వారిపై ఆధిపత్యం చలాయించడమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందన్నారు. కేంద్రానికి తెలంగాణ నుంచి అధిక మొత్తంలో పన్నులు వెళ్తున్నాయని, అయినా రాష్ట్రాభివృద్ధికి సరైన నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు.

ఆ ప్రచారంలో వాస్తవం లేదు

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కొందరు ప్రభుత్వంపై తిరుగుబాటు కోసం రహస్య సమావేశాలు నిర్వహించారని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో ఎంఎస్‌ఎన్ పరిశ్రమ అధినేత జీవన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, రఘునాయక్, తిరుపతిరెడ్డి, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు వెయ్యిగొంతుకలు..లక్ష డప్పులు



బొంరాస్‌పేట: పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్



దుద్యాల్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బొంరాస్‌పేట: లక్ష్యసాధనకు వెయ్యిగొంతుకలు..లక్ష డప్పులు ఒక్కటై చేపట్టనున్న నిరసన గళాన్ని ప్రభుత్వానికి వినిపించాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రేగడిమైలారంలో సమావేశమై గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కోకన్వీనర్ గోవర్ధన్, గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్, మొగులయ్య, రాజేశ్, సాయిలు, రిటైర్డ్ టీచర్ నర్సిరెడ్డి, న్యాయవాది సురేశ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: లక్ష డబ్బులు వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు సోమశేఖర్ అన్నారు. మాదిగలు ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు దస్తప్ప, దాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: నాజుఖాన్‌పల్లిలో సభ కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మలక్కన్న, శ్రీనివాస్, మధు, కాశీనాథ్, వెంకటేశ్, కృష్ణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: మాట్లాడుతున్న భరత్‌కుమార్

కుల్కచర్ల: లక్ష దప్పులు వేలగొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుల్కచర్ల మండల కాంగ్రెస్ బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి దళిత బహుజన ప్రజానీకం పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్, వెంకటయ్య, బంధయ్య, మొగులయ్య, కృష్ణ, భాను, వెంకట్, బాబు తదితరులు పాల్గొన్నారు.